17-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - వినాశీ శరీరాలను ప్రేమించకుండా అవినాశీ తండ్రిని ప్రేమించండి, తద్వారా ఏడ్వడము నుండి విముక్తులవుతారు"

ప్రశ్న:- అధర్మయుక్తమైన ప్రేమ అంటే ఏమిటి మరియు దాని పరిణామం ఏమిటి?

జవాబు:- వినాశీ శరీరాల పట్ల మోహం పెట్టుకోవడము అధర్మయుక్తమైన ప్రేమ. ఎవరైతే వినాశీ వస్తువుల పట్ల మోహము పెట్టుకుంటారో, వారు ఏడుస్తారు. దేహాభిమానం కారణంగా ఏడుపు వస్తుంది. సత్యయుగములో అందరూ ఆత్మాభిమానులే, అందుకే అక్కడ ఏడవడం యొక్క విషయమే ఉండదు. ఎవరైతే ఏడుస్తారో వారు పోగొట్టుకుంటారు. అవినాశీ తండ్రి యొక్క అవినాశీ పిల్లలకు ఇప్పుడు శిక్షణ లభిస్తుంది - దేహీ-అభిమానులుగా అయినట్లయితే ఏడ్వడం నుండి విముక్తులవుతారు అని.

ఓం శాంతి. ఆత్మ అవినాశీ అని మరియు తండ్రి కూడా అవినాశీ అని పిల్లలకే తెలుసు, కావున ఎవరిని ప్రేమించాలి? అవినాశీ ఆత్మను. అవినాశీనే ప్రేమించాలి, వినాశీ శరీరాన్ని ప్రేమించకూడదు. మొత్తం ప్రపంచమంతా వినాశీయే, ప్రతి ఒక్క వస్తువూ వినాశీయే, ఈ శరీరము వినాశీయే, ఆత్మ అవినాశీ. ఆత్మ పట్ల ప్రేమ అవినాశీగా ఉంటుంది. ఆత్మ ఎప్పుడూ మరణించదు, దీనిని సత్యం అని అంటారు. తండ్రి అంటారు, మీరు అధర్మయుక్తముగా అయిపోయారు. వాస్తవానికి అవినాశీ అయినవారికి అవినాశీ అయినవారి పట్ల ప్రేమ ఉండాలి. మీ ప్రేమ వినాశీ శరీరము పట్ల ఏర్పడింది కావుననే ఏడవవలసి వస్తుంది. అవినాశీ అయినవారితో ప్రేమ లేదు. వినాశీ అయినదానితో ప్రేమ ఉన్న కారణముగా ఏడవవలసి వస్తుంది. ఇప్పుడు మీరు స్వయాన్ని అవినాశీ ఆత్మగా భావిస్తారు కావున ఏడ్చే విషయము లేదు ఎందుకంటే ఆత్మాభిమానులుగా ఉన్నారు. కావున తండ్రి ఇప్పుడు పిల్లలైన మిమ్మల్ని ఆత్మాభిమానులుగా తయారుచేస్తారు. దేహాభిమానులుగా ఉన్న కారణముగా ఏడవవలసి వస్తుంది. వినాశీ శరీరము వెనుక పడి ఏడుస్తూ ఉంటారు. ఆత్మ మరణించదు అని అర్థం చేసుకుంటారు కూడా. తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావించండి. అవినాశీ తండ్రి పిల్లలైన మీరు అవినాశీ ఆత్మలు, మీరు ఏడవవలసిన అవసరం లేదు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి వెళ్ళి ఇంకొక పాత్రను అభినయిస్తుంది. ఇది ఒక ఆట. మీరు శరీరముపై మమకారాన్ని ఎందుకు ఉంచుకుంటారు. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాల నుండి బుద్ధియోగాన్ని తెంచి వేయండి. స్వయాన్ని అవినాశీ ఆత్మగా భావించండి. ఆత్మ ఎప్పుడూ మరణించదు. ఎవరైతే ఏడుస్తారో వారు పోగొట్టుకుంటారు అన్న గాయనము కూడా ఉంది. ఆత్మాభిమానులుగా అవ్వడం ద్వారానే యోగ్యులుగా అవుతారు. తండ్రి వచ్చి దేహాభిమానుల నుండి ఆత్మాభిమానులుగా తయారుచేస్తారు. వారు అంటారు, మీరు అలా ఎలా మర్చిపోయారు. జన్మ-జన్మాంతరాలూ మీరు ఏడవవలసి వచ్చింది. ఇప్పుడు మళ్ళీ మీకు ఆత్మాభిమానులుగా అయ్యే శిక్షణ లభిస్తుంది. ఆ తర్వాత మీరు ఇక ఎప్పుడూ ఏడవరు. ఇది ఏడ్చే ప్రపంచము, అది నవ్వే ప్రపంచము. ఇది దుఃఖ ప్రపంచము, అది సుఖ ప్రపంచము. తండ్రి చాలా చక్కగా శిక్షణను ఇస్తారు. అవినాశీ తండ్రి యొక్క అవినాశీ పిల్లలకు శిక్షణ లభిస్తుంది. వారు దేహాభిమానులైన కారణముగా దేహమునే చూసి శిక్షణను ఇస్తారు. దేహపు స్మృతి రావడంతో ఏడుస్తారు. శరీరము అంతమైపోయిన తర్వాత వారిని తలచుకోవడం వల్ల లాభమేముంది అని కూడా గమనిస్తారు. మట్టిని తలచుకుంటారా ఏమిటి? అవినాశీ వస్తువు వెళ్ళి ఇంకొక శరీరాన్ని తీసుకుంది.

ఎవరైతే మంచి కర్మలు చేస్తారో వారికి మళ్ళీ శరీరము కూడా మంచిది లభిస్తుందని పిల్లలకు తెలుసు. కొందరికి పాడైపోయిన రోగీ శరీరము లభిస్తుంది, అది కూడా కర్మల అనుసారమే లభిస్తుంది. మంచి కర్మలు చేస్తే పైకి వెళ్ళిపోతారని కాదు. అలా కాదు. పైకి ఎవ్వరూ వెళ్ళలేరు. మంచి కర్మలు చేసినట్లయితే మంచివారిగా పిలువబడతారు, జన్మ మంచిగా లభిస్తుంది, అయినా కానీ కిందకైతే దిగవలసిందే. మనం ఏ విధంగా పైకి ఎక్కుతామో మీకు తెలుసు. మంచి కర్మల ద్వారా ఎవరైనా మహాత్ములుగా అయినా కానీ కళలైతే తగ్గుతూనే ఉంటాయి. తండ్రి అంటారు, అయినా ఈశ్వరుడిని తలచుకుంటూ మంచి కర్మలు చేసినట్లయితే వారికి అల్పకాలికమైన, క్షణ భంగురమైన సుఖాన్ని ఇస్తాను. అయినా కానీ మెట్లను కిందకు దిగవలసిందే. ఏదో కాస్త పేరు ప్రఖ్యాతమవుతుంది. ఇక్కడైతే మనుష్యులకు మంచి, చెడు కర్మలను గురించి కూడా తెలియదు. రిద్ధి-సిద్ధి కలవారికి ఎంత గౌరవాన్ని ఇస్తారు. వారి వెనుక మనుష్యులు హైరానా పడుతూ ఉంటారు. అదంతా అజ్ఞానమే. ఎవరైనా ఇన్ డైరెక్ట్ గా దాన-పుణ్యాలు చేస్తే ధర్మశాలలు, హాస్పిటళ్ళు తయారుచేస్తే మరుసటి జన్మలో దానికి ప్రతిఫలము తప్పకుండా లభిస్తుంది. తండ్రిని స్మృతి చేస్తారు, గ్లాని చేస్తున్నా

కానీ నోటి నుండైతే భగవంతుని పేరును ఉచ్చరిస్తారు. ఇకపోతే అజ్ఞానులుగా ఉన్న కారణముగా ఏమీ తెలియదు. భగవంతుడిని స్మృతి చేసి రుద్రపూజను చేస్తారు, రుద్రుడిని భగవంతునిగా భావిస్తారు, రుద్ర యజ్ఞాన్ని రచిస్తారు. శివుని లేక రుద్రుని పూజను చేస్తారు. తండ్రి అంటారు, నా పూజను చేస్తారు కానీ బుద్ధిహీనతతో ఏమేమి తయారుచేస్తారు మరియు ఏమేమి చేస్తారు. మనుష్యులు ఎంతమందో, వారికి అంతమంది గురువులు ఉన్నారు. వృక్షములో కొత్త-కొత్త ఆకులు, శాఖోపశాఖలు మొదలైనవి వెలువడినప్పుడు అవి ఎంతగా శోభిస్తాయి. సతోగుణీగా ఉన్న కారణముగా వారి మహిమ జరుగుతుంది. ఈ ప్రపంచము ఉన్నదే వినాశీ వస్తువులను ప్రేమించే ప్రపంచము. ఎవరికైనా ఎంతో ప్రేమ ఉంటే ఆ మోహములో పిచ్చివారిలా అయిపోతారు. గొప్ప, గొప్ప షావుకార్లు మోహానికి వశమై పిచ్చివారిగా అయిపోతారు. మాతలకు జ్ఞానం లేని కారణముగా వినాశీ శరీరము వెనుక విధవలుగా అయి ఎంతగా ఏడుస్తూ ఉంటారు, తలచుకుంటూ ఉంటారు. ఇప్పుడు మీరు స్వయాన్ని ఆత్మగా భావిస్తూ ఇతరులను కూడా ఆత్మగా చూస్తారు కావున కొద్దిగా కూడా దుఃఖము కలుగదు. చదువును సంపాదనకు ఆధారము అని అంటారు. చదువులో లక్ష్యము-ఉద్దేశ్యము కూడా ఉంటుంది. కానీ అది ఒక్క జన్మ కొరకు. గవర్నమెంట్ నుండి జీతము లభిస్తుంది. చదువుకుని వ్యాపార, వ్యవహారాలు చేసుకుంటారు, అప్పుడు డబ్బులు మొదలైనవి లభిస్తాయి. ఇక్కడైతే విషయమే కొత్తది. మీరు అవినాశీ జ్ఞాన రత్నాలతో మీ జోలెను నింపుకుంటారు. బాబా మనకు అవినాశీ జ్ఞాన ఖజానాను ఇస్తున్నారని ఆత్మ అర్థం చేసుకుంటుంది. భగవంతుడు చదివిస్తారు కావున తప్పకుండా భగవాన్, భగవతీలుగానే తయారుచేస్తారు. కానీ వాస్తవానికి ఈ లక్ష్మీ-నారాయణులను భగవాన్, భగవతీలుగా భావించడం తప్పు. ఓహో, మేము దేహాభిమానులుగా అయినప్పుడు మా బుద్ధి ఎంతగా దిగజారిపోతుంది అని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. జంతువుల బుద్ధి వలె అయిపోతుంది. జంతువులకు కూడా ఎంతో మంచి సేవ జరుగుతుంది. మనుష్యులకైతే ఏమీ జరుగదు. రేస్ గుర్రాలు మొదలైనవాటి పాలన ఎంత బాగా జరుగుతుంది. ఇక్కడ మనుష్యుల పరిస్థితి ఎలా ఉందో చూడండి. కుక్కలను ఎంత ప్రేమగా సంభాళిస్తారు. అవి నాకుతూ ఉంటాయి, వాటిని తమతోపాటు పడుకోబెట్టుకుంటారు కూడా. ప్రపంచం పరిస్థితి ఎలా అయిపోయిందో చూడండి. అక్కడ సత్యయుగములో ఇటువంటి వ్యాపారమేమీ ఉండదు.

తండ్రి అంటారు, పిల్లలూ, మిమ్మల్ని మాయా రావణుడు అధర్మయుక్తముగా చేసేసాడు. ఇది అధర్మయుక్తమైన రాజ్యం కదా. మనుష్యులు అధర్మయుక్తముగా ఉన్నారు కావున మొత్తం ప్రపంచమంతా కూడా అధర్మయుక్తముగా అయిపోతుంది. ధర్మయుక్తమైన మరియు అధర్మయుక్తమైన ప్రపంచానికి ఎంత తేడా ఉందో చూడండి! కలియుగ పరిస్థితి ఎలా ఉందో చూడండి! నేను స్వర్గ స్థాపన చేస్తున్నాను కావున మాయ కూడా తన స్వర్గాన్ని చూపిస్తుంది, ప్రలోభము కలిగిస్తుంది. కృత్రిమమైన ధనము ఎంత ఉంది. మేము ఇక్కడే స్వర్గములో కూర్చున్నాము అని భావిస్తారు. స్వర్గములో ఇంత పెద్ద 100 అంతస్థుల భవనాలు మొదలైనవి ఉంటాయా. ఇళ్ళను ఎలా అలంకరిస్తారో చూడండి. అక్కడైతే రెండంతస్థుల ఇళ్ళు కూడా ఉండవు. మనుష్యులే చాలా తక్కువమంది ఉంటారు. ఇంత భూమిని మీరు ఏమి చేసుకుంటారు. ఇక్కడ భూమి కోసం ఎంతగా గొడవపడుతూ-కొట్లాడుకుంటూ ఉంటారు. అక్కడ మొత్తం భూమి అంతా మీదిగానే ఉంటుంది. ఎంతగా రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. వారు లౌకిక తండ్రి, వీరు పారలౌకిక తండ్రి. పారలౌకిక తండ్రి పిల్లలకు ఇవ్వనిదంటూ ఏముంది. అర్ధకల్పం మీరు భక్తి చేస్తారు. దాని వల్ల ముక్తి లభించదు అనగా నన్ను కలుసుకోరు అని తండ్రి స్పష్టంగా చెప్తారు. మీరు ముక్తిధామములో నాతో కలుసుకుంటారు. నేను కూడా ముక్తిధామములో ఉంటాను. మీరు కూడా ముక్తిధామములో ఉంటారు, ఆ తర్వాత అక్కడి నుండి మీరు స్వర్గములోకి వెళ్తారు. అక్కడ స్వర్గములో నేను ఉండను. ఇది కూడా డ్రామాయే. మళ్ళీ ఖచ్చితముగా ఇలాగే రిపీట్ అవుతుంది, మళ్ళీ ఈ జ్ఞానాన్ని మర్చిపోతారు. ఇది కనుమరుగైపోతుంది. ఎప్పటివరకైతే సంగమయుగము రాదో అప్పటివరకూ గీతా జ్ఞానం ఎలా ఉండగలదు. మిగిలిన శాస్త్రాలు మొదలైనవేవైతే ఉన్నాయో అవి భక్తి మార్గపు శాస్త్రాలు.

ఇప్పుడు మీరు జ్ఞానాన్ని వింటున్నారు. నేను బీజరూపుడను, జ్ఞానసాగరుడను. నేను మిమ్మల్ని ఏమీ చేయనివ్వను, కాళ్ళు కూడా పట్టుకోనివ్వను. ఎవరి కాళ్ళను పట్టుకుంటారు. శివబాబాకైతే కాళ్ళు లేవు. ఇది బ్రహ్మ కాళ్ళు పట్టుకోవడం అవుతుంది. నేనైతే మీ సేవకుడను. వారిని నిరాకారుడు, నిరహంకారి అని అంటారు. అది కూడా ఎప్పుడైతే వారు కర్మలోకి వస్తారో అప్పుడే నిరహంకారి అని అంటారు. తండ్రి మీకు అపారమైన జ్ఞానాన్ని ఇస్తారు. ఇది అవినాశీ జ్ఞాన రత్నాల దానము. ఇక ఎవరు ఎంతగా తీసుకుంటే అంత. అవినాశీ జ్ఞాన రత్నాలను తీసుకొని మళ్ళీ ఇతరులకు దానం చేస్తూ వెళ్ళండి. ఒక్కొక్క రత్నము లక్షల విలువ చేస్తుంది అని ఈ రత్నాలను గురించే అనడం జరుగుతుంది. అడుగడుగులోనూ పదమాలను ఇచ్చేవారైతే ఒక్క తండ్రే. సేవ పట్ల ఎంతో అటెన్షన్ ఉండాలి. మీ అడుగులు స్మృతి యాత్రకు సంబంధించినవి, దాని ద్వారా మీరు అమరులుగా అవుతారు. అక్కడ మరణించడం

మొదలైనవాటి చింత ఉండదు. ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు. మోహజీత్ రాజు కథను కూడా వినే ఉంటారు. ఇది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. ఇప్పుడు తండ్రి మిమ్మల్ని ఈ విధంగా తయారుచేస్తారు, ఇవి ఇప్పటి విషయాలే.

రక్షాబంధనము పండుగను కూడా జరుపుకుంటారు. అది ఎప్పటి గుర్తు? పవిత్రముగా అవ్వండి అని భగవంతుడు ఎప్పుడన్నారు? కొత్త ప్రపంచము ఎప్పుడు ఉంటుందో, పాత ప్రపంచం ఎప్పుడు ఉంటుందో మనుష్యులకేమి తెలుసు. ఇది కూడా ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు ఇది కలియుగము, సత్యయుగము ఒకప్పుడు ఉండేది, ఇప్పుడు లేదు అని మాత్రం అంటారు. పునర్జన్మలను కూడా నమ్ముతారు. 84 లక్షల జన్మలు అని అంటారు, మరి తప్పకుండా పునర్జన్మలు తీసుకున్నట్లే కదా. నిరాకారుడైన తండ్రిని అందరూ తలచుకుంటారు. వారు సర్వాత్మల తండ్రి, వారే వచ్చి అర్థం చేయిస్తారు. దేహధారి తండ్రులైతే ఎందరో ఉన్నారు. జంతువులు కూడా తమ పిల్లలకు తండ్రులే. వారిని జంతువుల తండ్రి అని అనరు. సత్యయుగములో ఎటువంటి చెత్తా ఉండదు. మనుష్యులు ఎలా ఉంటారో ఫర్నీచర్ కూడా అలాగే ఉంటుంది. అక్కడ పక్షులు మొదలైనవి కూడా ఫస్ట్ క్లాస్ గా, అందంగా ఉంటాయి. అన్నీ మంచి, మంచి వస్తువులే ఉంటాయి. అక్కడి ఫలాలు ఎంత తీయగా, పెద్దగా ఉంటాయి. మళ్ళీ అదంతా ఏమైపోతుంది! తీపిదనం పోయి చేదుదనం వచ్చేస్తుంది. మీరు థర్డ్ క్లాస్ గా అయ్యేటప్పటికి వస్తువులు కూడా థర్డ్ క్లాస్ అయిపోతాయి. సత్యయుగము ఫస్ట్ క్లాస్ కావున అన్ని వస్తువులు ఫస్ట్ క్లాస్ అయినవే లభిస్తాయి. కలియుగములో ఉన్నది థర్డ్ క్లాస్. అన్ని వస్తువులూ సతో, రజో, తమోలను... దాటుతాయి. ఇక్కడైతే ఎటువంటి ఆనందమూ లేదు. ఆత్మ కూడా తమోప్రధానముగా ఉంది కావున శరీరము కూడా తమోప్రధానముగా ఉంది. ఇప్పుడు పిల్లలైన మీకు జ్ఞానం ఉంది, అది ఎక్కడ - ఇది ఎక్కడ, రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. తండ్రి మిమ్మల్ని ఎంత ఉన్నతులుగా తయారుచేస్తారు. ఎంతగా స్మృతి చేస్తారో అంతగా ఆరోగ్యము, సంపద రెండూ లభిస్తాయి. ఇంకా ఏమి కావాలి. ఈ రెండింటిలోనూ ఏ ఒక్కటి లేకపోయినా సంతోషము ఉండదు. ఆరోగ్యము ఉండి సంపద లేకపోతే అది ఎందుకు పనికివస్తుంది. డబ్బు ఉంటే లాడ్ కానా (పాకిస్తాన్ లోని సింధ్ ప్రాంతములో ఒక నగరము పేరు) తిరిగి రండి అని అంటారు. భారత్ బంగారు పిచ్చుకలా ఉండేదని పిల్లలు అర్థం చేసుకుంటారు, ఇప్పుడు ఆ బంగారము ఏది? బంగారము, వెండి, రాగి పోయాయి, ఇప్పుడు అంతా కాగితమే కాగితము. కాగితాలు నీటిలో కొట్టుకుపోతే డబ్బు ఎక్కడ దొరుకుతుంది. బంగారమైతే చాలా బరువుగా ఉంటుంది, అది అక్కడే మునిగిపోతుంది. అగ్ని కూడా బంగారాన్ని తగులబెట్టలేదు. కావున ఇక్కడ అంతా దుఃఖపు విషయాలే ఉన్నాయి. అక్కడ ఈ విషయాలేవీ ఉండవు. ఇక్కడ ఈ సమయంలో అపారమైన దుఃఖము ఉంది. ఎప్పుడైతే అపారమైన దుఃఖాలు ఉంటాయో అప్పుడే తండ్రి వస్తారు, రేపు మళ్ళీ అపారమైన సుఖాలు ఉంటాయి. బాబా అయితే కల్పకల్పమూ వచ్చి చదివిస్తారు, ఇది కొత్త విషయమేమీ కాదు. సంతోషముగా ఉండాలి. అంతా సంతోషమే సంతోషము. ఇది అంతిమ సమయపు విషయము. అతీంద్రియ సుఖము గురించి గోప-గోపికలను అడగండి. చివరి సమయంలో మీరు చాలా బాగా అర్థం చేసుకుంటారు.

సత్యమైన శాంతి అని దేనిని అంటారో తండ్రే తెలియజేస్తారు. మీరు తండ్రి నుండి శాంతి వారసత్వాన్ని తీసుకుంటారు. వారిని అందరూ తలచుకుంటారు. తండ్రి శాంతిసాగరుడు. వారి వద్దకు ఎవరు రాగలరో తండ్రి అర్థం చేయిస్తారు. ఫలానా-ఫలానా ధర్మము ఫలానా-ఫలానా సమయంలో వస్తుంది. వారు స్వర్గములోకైతే రాలేరు. ఇప్పుడు సాధు-సన్యాసులు ఎంతోమంది వెలువడ్డారు కావున వారి మహిమ జరుగుతుంది. పవిత్రముగా ఉన్నారు కావున వారి మహిమ తప్పకుండా జరగాలి. వారు ఇప్పుడే కొత్తగా దిగారు. పాతవారికి అంతటి మహిమ ఉండదు. వారు సుఖాన్ని అనుభవించి తమోప్రధానతలోకి వెళ్ళిపోయారు. రకరకాల గురువులు ఎంతమంది వెలువడుతూ ఉంటారు. ఈ అనంతమైన వృక్షము గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రి అర్థం చేయిస్తారు, భక్తి సామాగ్రి ఒక వృక్షము విస్తరించినంతగా ఉంది, జ్ఞాన బీజము ఎంత చిన్ననిది. భక్తికి అర్ధకల్పం పడుతుంది. ఈ జ్ఞానమైతే కేవలం ఈ ఒక్క అంతిమ జన్మ కొరకే ఉంటుంది. జ్ఞానాన్ని పొంది మీరు అర్ధకల్పం కొరకు యజమానులుగా అయిపోతారు. భక్తి ఆగిపోతుంది, పగలు వస్తుంది. ఇప్పుడు మీరు సదాకాలము కొరకు హర్షితముగా అవుతారు, దీనిని ఈశ్వరుని అవినాశీ లాటరీ అని అంటారు. దీని కొరకు పురుషార్థము చేయవలసి ఉంటుంది. ఈశ్వరీయ లాటరీ మరియు ఆసురీ లాటరీలో ఎంతటి తేడా ఉంటుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ స్మృతి యొక్క ప్రతి అడుగులో పదమాలు ఉన్నాయి, దీని ద్వారానే అమర పదవిని ప్రాప్తి చేసుకోవాలి. అవినాశీ జ్ఞాన రత్నాలు ఏవైతే తండ్రి నుండి లభిస్తాయో, వాటిని దానం చేయాలి.

2. ఆత్మాభిమానులుగా అయి అపారమైన సంతోషాన్ని అనుభవం చేయాలి. శరీరాల పట్ల మోహాన్ని తొలగించి సదా హర్షితంగా ఉండాలి, మోహజీతులుగా అవ్వాలి.

వరదానము:- ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ సదా ఆత్మిక ఆనందంలో ఉండే విశేష ఆత్మా భవ

సంగమయుగము ఆత్మిక ఆనందాలలో ఉండే యుగము, అందుకే ప్రతి ఘడియ ఆత్మిక ఆనందాన్ని అనుభవం చేస్తూ ఉండండి, ఎప్పుడూ ఎటువంటి పరిస్థితిలోనూ లేక పరీక్షలోనూ తికమకపడకండి ఎందుకంటే ఈ సమయము అకాల మరణాలు జరిగే సమయము. కొద్ది సమయమైనా ఆనందానికి బదులుగా తికమకపడితే మరియు ఆ సమయంలోనే అంతిమ ఘడియ వస్తే అంతిమ స్థితిని బట్టి ఎటువంటి గతి ఏర్పడుతుంది. అందుకే ఎవరెడీ పాఠాన్ని నేర్పించడం జరుగుతుంది. ఒక్క క్షణమైనా మోసం చేసేదిగా ఉండవచ్చు. అందుకే స్వయాన్ని విశేష ఆత్మగా భావిస్తూ ప్రతి సంకల్పము, మాట మరియు కర్మను చేయండి మరియు సదా ఆత్మిక ఆనందంలో ఉండండి.

స్లోగన్:- అచలంగా అవ్వాలంటే వ్యర్థాన్ని మరియు అశుభాన్ని సమాప్తం చేయండి.